క్లుప్తంగా

నీటికుంటలకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: భూగర్భ జలాలను పెంపొందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కమ్మ సిగడాం పంచాయతీ యాగాటిపాలెం సమీపంలో రైతు పొలంలో నీటి కుంటలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ కె.లోకేష్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఏపీఓ శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన


విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరమని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ యండ శ్రీనివాసరావు అన్నారు. కాలేజీలో వారం రోజుల పాటు నిర్వహించిన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌పై నిర్వహించిన వర్కు షాపు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏఐపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని చెప్పారు. భవిష్యత్తులో అన్ని రంగాల సేవల్లోనూ ఏఐ విస్తరిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంట సంజీవని పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార: పంట సంజీవనితో రైతులకు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం అంపోలు పంచాయతీ పరిధిలో పంట సంజీవని పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి కుంటల వల్ల వర్షపునీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. చిన్న, సన్నకారు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సిమ్మ రామ్మోహనరావు, ఏపీడీ లోకేష్, గొండు వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన


పూజలు చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ ముద్దాడపేటలో రామాలయం విగ్రహాల ప్రతిష్టాపన శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మురపాకలో గ్రామసభ


వివరాలు వెల్లడిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెయ్యిల నాగమణి అధ్యక్షతన ఉపాధిహామీ చట్టం సామాజిక తనిఖీల ప్రత్యేక గ్రామసభ శనివారం నిర్వహించారు. గత సంవత్సరంలో చేపట్టిన పనులను ప్రజలకు ఆడిట్ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెయ్యిల లక్ష్మణరావు, వార్డు మెంబర్లు, పంచాయితీ కార్యదర్శి వెంకటరమణ, టీఏ ఎల్లంనాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోర్సుల ప్రారంభానికి కసరత్తు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో రెండు పీజీ కోర్సులు ప్రారంభానికి కసరత్తులు చేస్తున్నారు. ఈ మేరకు కోర్సులు ప్రారంభానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ ప్రిన్సిపాళ్లు ఉన్నతాధికారులకు లేఖలు అందజేశారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఎమ్మెస్సీ జియోలజీ, ఎమ్మెస్సీ జియోఫిజిక్స్ ప్రారంభించాలని లేఖ రాశారు. రెండేళ్లలో జియోలజీ, మూడేళ్లలో జియోఫిజిక్స్ డిగ్రీ అందజేస్తారు. ఎంఏ ఫిలాసఫీ కోర్సు కూడా ప్రారంభించాలని ఆర్ట్సు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ లేఖ రాశారు. పాలక మండలి అనుమతితోనా లేక తమ పరిధిలోనే ప్రారంభిస్తారా అన్నది చూడాల్సిందే.

- పాత బ్రిడ్జి, కొత్త బ్రిడ్జి, పొన్నాడ వంతెనలపై కానరాని సీసీ కెమెరాలు
- ప్రమాదాలు జరిగినా, మృతదేహాలు బయటపడినా ట్రేస్ చేయలేకపోతున్న పోలీసులు


శ్రీకాకుళం డే అండ్ నైట్ వంతెన

వంతెనలపై.. ఏం జరిగినా అంతేనా?


ఏడురోడ్ల కూడలి వంతెన


పొన్నాడ వంతెన

శ్రీకాకుళం క్రైమ్: అది జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం.. కలెక్టర్, ఎస్పీ, ఇతర విభాగాల జిల్లా అధికారులు సమావేశమై ఉన్నారు. రోడ్డు ప్రమాదాలపై జరిగిన చర్చలో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఇటీవల జరిగిన ఓ ఘటనపై ఉద్వేగభరితంగా మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ కొత్త బ్రిడ్జిపై స్కూటీపై భర్తతో పయనిస్తున్న ఓ నిండు గర్భిణీ ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడిపోతే.. కనీసం మానవత్వం లేకుండా డ్రైవర్ సంబంధం లేదని చెప్పడం, సంబంధిత విభాగం సైతం అతని తరఫునే మాట్లాడటం తనకు విస్మయానికి గురిచేసిందని చెప్పారు. ఇక్కడ ఆర్టీసీ వాదన మరోలా ఉంది. విజయా ల్యాబ్‌లో ఉన్న సీసీ ఫుటేజీ కెమెరాల్లో స్కూటీ వెళ్లిన కొన్ని నిమిషాల తర్వాత తాము వెనుకగా వెళ్తే మేమే ఢీకొట్టామంటే ఎలా అన్నది వారి వాదన. ఇలాంటి హిట్ అండ్ రన్ ఘటనలు జిల్లాలో అనేకం. వంతెనపై సీసీ కెమెరాలు లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలపై స్పష్టత లేకుండా పోయింది.

మూడు వంతెనలదీ అదే పరిస్థితి..

జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో డేఅండ్‌నైట్, ఏడురోడ్లు కూడలి, పొన్నాడ వద్ద వంతెనలు ఉన్నాయి. దురదృష్టవశాత్తు వంతెనల పైనుంచి ఎవరైనా నాగావళిలో దూకేసినా, కావాలనే ఎవరైనా తోసేసినా, రోడ్డు ప్రమాదాలు జరిగినా పోలీసులు ట్రేస్ చేయలేకపోతున్నారు. ప్రధానంగా సీసీ ఫుటేజీ లేకపోవడం సమస్యగా కనిపిస్తోంది.

బ్రిడ్జిలపై కొన్ని ఘటనలు పరిశీలిస్తే..

- గత నెల 28న ఏడురోడ్ల కూడలి సమీప పాత వంతెన పైనుంచి యాదవరెడ్డి రాము నాగావళి నదిలో పడిపోయాడు. రాళ్లు తగిలి మృతిచెందాడు. ముందురోజు జరిగినా విషయం వెనుకరోజు బయటపడింది.
- ఫిబ్రవరిలోనే ఐదు రోజులు బాగా కుళ్లిన శవం నాగావళి నదిలో బయటపడింది. చేతి భుజంపై డి.లక్ష్మి పేరుతో పుట్టుమచ్చ ఉండటంతో మృతున్ని గుర్తించారు.
- రిక్షానే గూడుగా చేసుకున్న ఓ తాత డేఅండ్‌నైట్ సమీప వంతెన వద్దనే ఉండేవాడు. వేకువ ఝామున ఓ కారు రిక్షాతో సహా వృద్ధుడిని ఢీకొట్టడంతో మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు మానవతా దృక్పథంతో ఈ రిక్షాతాతను పలుమార్లు ఆదుకున్నారు.
- ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో చదువుతున్న తన మేనకోడలను రాజమండ్రి పంపేందుకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సుకు వస్తున్న కె.నారన్నాయుడు అనే వ్యక్తి డేఅండ్‌నైట్ కొత్త బ్రిడ్జి మీదకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టిపోయాడు. నారన్నాయుడుకు కాళ్లు విరిగిపోయాయి. అతని మేనకోడలికి గాయాలయ్యాయి.

దాతలే దిక్కు..

- జిల్లాకేంద్రంలో ప్రభుత్వంతో అనుసంధానంగా ఉన్న ట్రైమ్యాక్స్ సంస్థ 273 సీసీ కెమెరాలు పెట్టించింది. జిల్లావ్యాప్తంగా మరో 611 ఉన్నాయి. ఎస్పీ సైతం జిల్లాకు మరో 1100 నుంచి 1200 వరకు సీసీ కెమెరాలుంటే నేరాలు అరికట్టేందుకు మరింత సులవవుతుందని, సీఎస్ఆర్ ఫండ్స్, పోలీసింగ్ ఫండ్సే కాక పబ్లిక్ నుంచి (దాతల సౌజన్యంతో)కూడా సహకరిస్తే బాగుంటుందన్నారు.
- జిల్లాకేంద్రంలో ప్రధానంగా ఈ మూడు వంతెనలపై 20 నుంచి 25 (ఇటు నుంచి నాలుగు అటు నుంచి నాలుగు) వరకు కెమెరాలు అవసరమవుతాయని పలువురు అంటున్నారు.

అది మంచి పద్ధతి కాదు..



రోడ్డుపై ప్రమాదాలు కొన్నిసార్లు అనుకోకుండా మన తప్పులేకపోయినా జరుగుతాయి. ఎక్కడ మనం ఆగితే కేసులవుతాయోనని భయపడి పారిపోయే (హిట్ అండ్ రన్) పద్ధతి మంచిది కాదు. క్షతగాత్రుని పరిస్థితి చూడాలి. వీలుంటే ఆసుపత్రికి గోల్డెన్ హవర్లో చేర్పించాలి. సీసీ కెమరాలు నగరం వరకు చూసుకుంటే డేఅండ్‌నైట్ నుంచి ఇలిసిపురం జంక్షన్ మీదుగా రామలక్ష్మణ జంక్షన్ వరకు అవసరం. బ్రిడ్జిలపై ఉంటే మరింత మంచిది. మిగతా చోట్ల మాల్స్, షాప్స్, హోటళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రయివేటు వ్యక్తులు పెట్టుకునేవి ఉపయోగపడతాయి.

– నాగరాజు, ట్రాఫిక్ సీఐ

అధికారుల తీరు సరికాదు

- అందుబాటులో ఉండకపోతే ఎలా?
- లావేరు మండల సమావేశంలో మండిపాటు


మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలో గ్రామీణాభివృద్ధి, నీటిసరఫరా, వ్యవసాయం ఇలా పలు శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉండటం లేదని పలువురు సర్పంచ్‌లు ఆరోపించారు. శనివారం లావేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ ఏఈ శ్రీవల్లి మాట్లాడుతూ రూ.10 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ అప్పన్న మాట్లాడుతూ 18 గ్రామాల్లో కొత్తగా బోరుబావులు వేయడాన్ని నిషేధించామని చెప్పారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ మంజూరుకు తహసీల్దార్ ధ్రువీకరించిన ఫారం–3 అవసరమని స్పష్టం చేశారు. అదపాక, గుర్రాలపాలెం ఎంపీటీసీలు గంట్యాడ సత్యం, జనపాల బానోజీరావులు మాట్లాడుతూ తమ గ్రామాలను రెడ్‌జోన్ నుంచి తొలగించాలని, బోరుబావులు లేక వ్యవసాయానికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండటం లేదని సభ్యులంతా అధికారులను నిలదీశారు. గ్రామీణాభివృద్ధి నీటిసరఫరా జేఈ మణికంఠ మండలంలో అందుబాటులో లేరని, ఫోన్లు చేసినా స్పందించరని, తమ పనులను చేయడం లేదని మండిపడ్డారు. ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సమస్యలను పరిష్కరించాలని జేఈకి సూచించారు. ఎంపీడీవో పి.వెంకటరాజు మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చేతిపంపుల మరమ్మతులకు రూ.5 లక్షలతో పరికరాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రణస్థలం ఎక్సైజ్ ఎస్సై షర్మిల మాట్లాడుతూ లావేరు మండలంలో క్రమ మద్యం తరలింపు అమ్మకందారులపై 48 కేసులు నమోదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, డీటీ తిరుపతిరావు, వ్యవసాయాధికారి మహేష్‌నాయుడు, రణస్థలం ఎక్సైజ్ ఎస్సై షర్మిల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జల వనరుల సంరక్షణ అందరి బాధ్యత


బుడుమూరులో చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కొండములగాంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: భవిష్యత్తు తరాల కోసం నీటిని ప్రతిఒక్కరూ పొదుపుగా వాడాలని నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కో–ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఇంకుడు గుంతలు తవ్వి నీటి సంరక్షణ చేపట్టాలన్నారు. ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరం థీమ్‌గా 'హిమానీనదుల సంరక్షణ' ప్రకటించిందని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు ఉరిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవుల మనగడకు నీరు అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నీటిబిందువు ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి నీటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు, ఎం.అనురాధ, కె.వెంకటరావు, కె.చిన్నపెంటయ్య, రమేష్‌బాబు, చంద్రశేఖర్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

- రణస్థలం: జల వనరుల సంరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఇమందు గురుమూర్తి అన్నారు. కొండములగాంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కింతలి నాగేశ్వరరావు, పంచాయతీ సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, ఎంపీటీసీ రెడ్డి వాసు, బాలవికాస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ రేగాన గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీలు!

ఎచ్చెర్ల: లావేరు మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై జరుగుతున్న సామాజిక తనిఖీలు తూతూమంత్రంగా సాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేసి కొలతలు తీసుకుని వేతనదారుల ఇంటికి వెళ్లి ఎన్ని రోజులు పనికి వెళ్లారు, ఎంత వేతనం వచ్చింది అనే విషయాలను వేతనదారులను అడిగి వివరాలను నమోదుచేయాలి. గ్రామసభలో ఆ వివరాలను చదివి వినిపించాలి. అనంతరం మండల ప్రజావేదికలో వెల్లడించారు. మండలంలో మాత్రం చాలాచోట్ల డీఆర్పీ బృందాలు గ్రామాల్లో పనిచేసిన ప్రదేశం, వేతనదారుని ఇంటికి వెళ్లకుండా గ్రామాల్లో ఏదో ఒక చోట కూర్చోని కొంతమంది మేట్లు ద్వారా మరికొందరు వేతనదారులతో నామమాత్రపు వివరాలను తీసుకుని తనిఖీ చేస్తున్నారు. ఇలాగైతే అసలు నిజాలు ఎలా తెలుస్తాయని పలువురు ప్రశిస్తున్నారు.

బృందావనంలో భజనలు

గార: మండలంలోని జొన్నలపాడు కాలనీ వద్ద శ్రీ బృందావనంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం భజనలు జరిగాయి. కార్యక్రమంలో చౌదరి దుర్గారావు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ పండా, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జలమే జీవనాధారం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచంలో సమస్త జీవకోటికి ప్రాణాధారం జలమేనని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞానభవన్‌లో శనివారం సేవ్ వాటర్ పేరిట పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రతినిధులు దినేష్, శ్రావణ్ కుమార్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు


మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తిరుపతిలో మే 15 నుంచి 18 వరకు జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు కోరారు. జిల్లా కేంద్రంలోని క్రాంతిభవన్‌లో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు చెల్లూరి రవి, నాయకులు వసంతరావు, హరి, బాలకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌ను పరిరక్షించుకుందాం


జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: భారత సంచార నిగమ్ లిమిటెడ్ సంస్థను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావు అన్నారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీకాకుళంలోని సంఘ కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. అనంతరం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఈయూ నాయకులు అభిమన్యు, డి.శ్రీనివాసరావు, పి.శారద, అరుణశ్రీ, ఎం.లక్ష్మి, సీహెచ్.లక్ష్మి, ఐసీహెచ్ చరణ్, రమణ, హెచ్.ఢిల్లీశ్వరరావు, యూ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రాలను రాష్ట్ర బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు గొండు సీతారం శనివారం పరిశీలించారు. ఏర్పాట్లపై ఆరా తీశారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు



నగరంలోని 'చిం' దత్తనాథ క్షేత్రంలో శనివారం సామూహిక అనఘాష్టమి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ అర్చకులు సింహాచల శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జయలక్ష్మీ మాతృమండలి సభ్యులు, ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

జగన్నాథ మందిరానికి కొత్త కళ



బొందిలీపురంలోని జగన్నాథ స్వామి ఆలయం నూతన సొబగులు సంతరించుకుంది. ఆలయ నిర్వాహకులు పలహారి మహంతి లక్ష్మీధర్‌దాస్ బావాజీ ఆధ్వర్యంలో విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలు, 11 మంది బాబాజీల విగ్రహాలు, ప్రత్యేక టైల్స్ ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు.

– శ్రీకాకుళం కల్చరల్

సాఫ్ట్‌స్కిల్స్‌తోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థిని

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రస్తుత సమాజంలో, మారుతున్న పోటీప్రపంచయుగంలో రాణించాలంటే విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్ చాలా అవసరమనే విషయాన్ని గుర్తించాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో జేకేసీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్టూడెంట్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరిని అభినందించారు. సాఫ్ట్‌స్కిల్స్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్స్, బాడీ లాంగ్వేజ్, డిజిటల్ వరల్డ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ట్రైనర్ ఎస్.అయేష్ షేక్, డాక్టర్ ఎస్.వాణీకుమార్, వీపీ పి.శంకర్‌నారాయణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, సీఓఈ టి.ఆదిలక్ష్మి, జేకేజీ కోఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, ఎస్.మాధవీలత, వి.శైలజ, ఎస్.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారిస్తేనే అధిక దిగుబడులు


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

రణస్థలం: జీరో టిల్లేజ్ మొక్కజొన్న పంటలో సకాలంలో కలుపు యాజమాన్యం చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని కాకినాడ జిల్లా పెద్దాపురం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం అఖిల భారత మొక్కజొన్న పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ వి.సుజాత తెలిపారు. వెంకటరావుపేటలో జీరో టిల్లేజ్ మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుపు నివారణకు విత్తిన వెంటనే అట్రాజిన్ 50 శాతం పొడి మందును 800–1200 గ్రాములు, వరి దుబ్బులు మొలకెత్తకుండా పారాక్వాట్ ఎకరాకు లీటర్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయలన్నారు. ఎరువుల యాజమాన్యం పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు, అఖిల భారత మొక్కజొన్న పరిశోధన సమన్వయ పథక విభాగం ప్రతినిధి హఫీజా పర్వీన్, అభ్యుదయ రైతు కలిశెట్టి ఆదినారాయణ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది ఆర్.దేవుడుబాబు, పి.తవిటినాయుడు, బి.లక్ష్మీనరసింహమూర్తి, రైతులు పాల్గొన్నారు.

రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం కల్చరల్: రక్తదాతలు నిజమైన ప్రాణదాతలని, వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున రక్త నిల్వల అవసరం ఉందని నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ యు.వెంకట ఉజ్వల్ అన్నారు. పెద్దపాడు రోడ్డులోని వీల్స్ మార్ట్, పద్మ పూజిత సంస్థ ఉద్యోగులు రెడ్‌క్రాస్ నేతృత్వంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ తలసేమియా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లల కోసం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మహత్తర కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు. అనంతరం 150 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంస్థ ఎండీ బండారు ఫణికుమార్ మాట్లాడుతూ నగరంలో రక్తం కొరత నేపథ్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఏ.కృష్ణ, ఐతం వెంకటేష్, జి.ఆనంద్, యు.రవి, పి.భాస్కర్, ఆర్.కృష్ణ, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, నంది ఉమాశంకర్, హర్షవర్ధన్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థ జలాలతో పంటలకు ముప్పు


మెంటాడ సమీపంలో వేసిన వ్యర్థ జలాల పైపులైన్లు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో అపర్ణా(పాత ల్యాన్‌టెక్) పరిశ్రమకు చెందిన వ్యర్థ జలాల పైపులైన్లు ఇష్టారాజ్యంగా వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని మెంటాడ రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న 4 అంగుళాల పాత పైపులైన్లు తీసి కొత్తగా ఆరు అంగులాల పైపులు పొలాల్లోంచి వేస్తున్నారని, అవి సక్రమంగా వేయకపోవడంతో లీకైతే పంటలు నాశనమవుతాయని చెబుతున్నారు. కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై పరిశ్రమ హెచ్ఆర్ ప్రతినిధి నాయుడు వద్ద ప్రస్తావించగా రైతులను సంప్రదించాకే పైపులు వేస్తున్నామని, ఇబ్బంది ఉంటే సరిచేస్తామని చెప్పారు.